అడ్డగుట్టను ఆదర్శంగా తీర్చిదిద్దాం

బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్


పద్మారావుగౌడ్‌కు హారతి ఇస్తున్న మహిళలు

అడ్డగుట్ట: సికింద్రాబాద్‌ను జంట నగరాల్లోని అభివృద్ధిలో అగ్ర కేంద్రంగా, అడ్డగుట్టను అభివృద్ధికి చిరునామాగా తీర్చిదిద్దిన ఘనత తమదేనని సికింద్రాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ అన్నారు. సోమవారం ఆయన స్థానిక కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మితో కలిసి బీ–సెక్షన్, వడ్డెరబస్తీ, రియో పాయింట్, తుకారాం గేట్, సాయి నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల్లో స్థానికులు పద్మారావుగౌడ్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం పద్మారావుగౌడ్ మాట్లాడుతూ.. సికింద్రాబాద్‌లో కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి పనులను చేపట్టామని, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో తమదే అగ్రస్థానం అన్నారు. స్థానికుల అభిమతాలకు అనుగుణంగా అడ్డగుట్టలో అన్ని సదుపాయాలను కల్పించేందుకు తాము ప్రత్యేక చొరవ తీసుకుంటున్నామన్నారు. అడ్డగుట్ట ప్రజల చిరకాల స్వప్నం నెరవేర్చేలా ఇటీవల రూ. 72 కోట్లతో తుకారాంగేట్ ఆర్‌యూబీ నిర్మించామని, రూ.13 కోట్లతో ఆస్పత్రిని నిర్మిస్తున్నామన్నారు. సీతాఫల్‌మండి ప్రభుత్వ స్కూల్‌లో కొత్త జూనియర్, డిగ్రీ కాలేజీలను తామే నెలకొల్పామని, వాటికి కొత్త భవనాలను నిర్మించే బాధ్యతను కూడా తామే చేపట్టి ముఖ్యమంత్రి నుంచి రూ. 30 కోట్ల మేరకు ప్రత్యేక నిధులను సాధించామన్నారు. అదే విధంగా కుట్టి వెల్లోడి ప్రభుత్వ ఆస్పత్రికి రూ. 12 కోట్ల మేరకు నిధులను సమకూర్చి కొత్త భవనాలను నిర్మిస్తున్నామని వివరించారు. టీడీపీ పార్టీకి చెందిన సీనియర్ నేత గణేష్ దంపతులు పద్మారావుగౌడ్ సమక్షంలో బీఆర్‌ఎస్ కండువా కప్పుకున్నారు.


వికలాంగుడితో మాట్లాడుతూ..

బీఆర్‌ఎస్ హయాంలో రౌడీయిజం నడుస్తోంది

• కాంగ్రెస్ అభ్యర్థి కోట నీలిమ


హనుమాన్ దేవస్థానాన్ని సందర్శించిన కోట నీలిమ

సనత్‌నగర్: బీఆర్‌ఎస్ హయాంలో అంతా రౌడీయిజమే నడుస్తోందని సనత్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి కోట నీలిమ ఆరోపించారు. సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానంలో సోమవారం ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కోట నీలిమ మాట్లాడుతూ.. సనత్‌నగర్ నియోజకవర్గం నుంచి తాను పోటీ చేస్తుంటే, తాను లోకల్ కాదని పుకార్లు చేస్తున్నారని మండిపడ్డారు. గత 50 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీతోనే ఉన్న తమ కుటుంబాన్ని నాన్ లోకల్ అని ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులకు గుణపాఠం తప్పదన్నారు. ఎన్నికల్లో గెలవాలంటే అభివృద్ధి చేయాలి గానీ, ఇలాంటి అసత్య ఆరోపణలు కాదన్నారు. ఇలాంటి పుకార్లు అన్నింటికీ అడ్డుకట్ట వేయాలంటే తెలంగాణలో కాంగ్రెస్ రావాలన్నారు. ఈ నెల 30న జరగనున్న ఎన్నికల్లో తప్పకుండా విజయం సాధిస్తామని, తనకు ఒక్క అవకాశం ఇస్తే అవినీతిరహిత పాలన అందిస్తూ ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూసుకుంటామని హామీ ఇచ్చారు. గత తొమ్మిదేళ్ల అహంకారపూరిత పాలనకు ముగింపు పలకాల్సిన అవసరం వచ్చిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గంగాధర్‌గుప్తా, తోట మణిమాల, ఆర్‌బీ నరేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్ బంధుగా మారిన దళితబంధు'



రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ తమ కార్యకర్తలకు దళిత బంధును ఇచ్చి బీఆర్‌ఎస్ బంధుగా మార్చిందని బీజేపీ అభ్యర్థి శ్రీ గణేష్ ఆరోపించారు. బీజేపీ మహంకాళి జిల్లా అధికార ప్రతినిధి బీఎన్. శ్రీనివాస్ ఆధ్వర్యంలో మూడవ వార్డులో బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణతో కలిసి సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీగణేష్ మాట్లాడుతూ.. కంటోన్మెంట్ ప్రాంతంలోని బోర్డుకు రావాల్సిన టీపీటీ నిధులను రాష్ట్ర ప్రభుత్వం స్వాహా చేస్తే కోర్టుని ఆశ్రయించి సాధించుకున్నామన్నారు. తాగునీటి విషయానికి వస్తే కంటోన్మెంట్ ప్రాంతంలో ఉచిత మంచినీటి సరఫరా చేస్తున్నామని బీఆర్‌ఎస్ నేతలు గొప్పలు చెప్పుకుంటున్నారని కాని నాలుగైదు రోజులకు ఒకసారి సరఫరా అవుతోందన్నారు. తనను గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తానని హామీ ఇచ్చారు. పార్టీ సీనియర్ నాయకులు టోపి శంకర్, భానుక మల్లికార్జున్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వాహకుల అరెస్టు


పోలీసుల అదుపులో బెట్టింగ్ నిర్వాహకులు

రసూల్‌పురా: ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్‌లో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఇద్దరిని నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ బృందం పోలీసులకు అప్పగించారు. పోలీసుల వివరాల ప్రకారం.. బోయిన్‌పల్లి సాయి ఉమా అపార్ట్‌మెంట్ నివాసముండే వస్త్రాల వ్యాపారి మహేష్ రమేష్ మణియాల్ (53), రైల్వే ఎన్‌క్లేవ్‌లో ఉండే వ్యాపారి తేజేష్ ఠక్కర్ (53) ఇరువురు, రైల్వే ఎన్‌క్లేవ్ తేజేష్ ఠక్కర్ నివాసంలో ఆదివారం జరిగిన మ్యాచ్ ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి ఇరువురిని అరెస్టు చేసి రూ.40 వేల నగదు, రూ.3,42,318 బ్యాంక్ బ్యాలెన్స్‌తో పాటు ఆన్‌లైన్ అమౌంట్ స్వాధీనం చేసుకున్నారు. వీరు ఢిల్లీ నుంచి ఐడీ పాస్‌వర్డ్ పొంది బెట్టింగ్ చేస్తున్నారు. స్థానిక పంటర్లకు ఐడీ పాస్‌వర్డ్ చెప్పి వాటిపై 30 కమీషన్ తీసుకుంటూ చెక్‌బెట్‌కో. వెబ్‌సైట్ ద్వారా బెట్టింగ్ ఆడుతున్నారని పోలీసులు తెలిపారు. ఈ దాడుల్లో నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ సీఐ ఎల్. భాస్కర్ రెడ్డి, ఎస్ఐలు బి. అశోక్‌రెడ్డి, జి.నవీన్ పాల్గొన్నారు.

పార్ట్‌టైం అధ్యాపకుల హర్షం

ఉస్మానియా యూనివర్సిటీ: వర్సిటీల పార్ట్‌టైం అధ్యాపకులకు నెలకు రూ.50 చొప్పున 12 నెలల పాటు గౌరవ వేతనం చెల్లిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొనడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఓయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ పార్టుటైం టీచర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సోమేశ్వర్ మాట్లాడారు. గతంలో వర్క్‌లోడ్ పెరగగానే పార్ట్‌టైం అధ్యాపకులను కాంట్రాక్టు టీచర్లుగా అప్‌గ్రేడ్ చేసి వేతనం రూ.50 వేలకు పైగా పెంచారన్నారు. రాష్ట్ర అవతరణ అనంతరం బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2014 నుంచి ఈ విధానాన్ని రద్దు చేయడంతో పార్ట్‌టైం అధ్యాపకులు శ్రమదోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్కువ వేతనానికి పని చేస్తున్న పార్ట్‌టైం అధ్యాపకులకు రూ.50 వేతనంతో కొంత మేర న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు డాక్టర్ ఆరుట్ల జానకిరెడ్డి, యుగేందర్, కరుణాకర్, ఆదిత్య, మౌలాలి, నరేందర్, వరలక్ష్మీ, స్నేహలత, కవిత, మాధవి పాల్గొన్నారు.


లంబాడీ బస్తీలో రెయిలింగ్ లేని జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం భవనాలు


ఇటీవల కూలిపడిన స్లాబ్

భద్రత లేని బతుకులు!

- రెయిలింగ్ లేని ఈడబ్ల్యూఎస్ భవనాలు
- భయం గుప్పిట్లో ప్రజలు
- శిథిలావస్థకు చేరిన పట్టించుకోని అధికారులు
- దశాబ్దాలుగా ఇదే దుస్థితి


రక్షణ గోడ లేని మెట్లు

అడ్డగుట్ట: ప్రజా సమస్యలు పరిష్కరించి, వారికి కావాల్సిన మౌలిక వసతులు కల్పించాలని అధికారులు, ప్రజాప్రతినిధులు వారిని పట్టించుకోకపోవడంతో బిక్కుబిక్కుమంటూ కాలం గడపాల్సిన దుస్థితి నెలకొంది. ఏ క్షణం ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని తెలియని అయోమయ పరిస్థితులు నెలకొంటున్నాయి. అధికారుల నిర్లక్ష్యంతో తమకు ఇబ్బందులు తప్పడం లేదని తుకారాంగేట్ మారాఠా బస్తీలోని ఎకనామికల్లీ వీకర్ సెక్షన్ (ఈడబ్ల్యూఎస్) స్కీం భవనాలు, అడ్డగుట్ట లంబాడీ బస్తీలోని జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎమ్ భవనాల నివాసితులు వాపోతున్నారు.

సొంత డబ్బులతో మరమ్మతులు..

గత ప్రభుత్వాల హయాంలో జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం పథకం కింద లంబాడీ బస్తీ, తుకారాంగేట్ మరాఠా బస్తీలో ఈడబ్ల్యూఎస్ స్కీం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు నిర్మించి ఇచ్చారు. ప్రస్తుతం వారి బతుకులు దినదినం గండం నూరేళ్ల ఆయుష్షు అన్న చందంగా మారింది. దీనికి కారణం ఇళ్లను నిర్మించిన అధికారులు సదరు గృహ సముదాయాల చుట్టూ, మెట్లకు రెయిలింగ్‌ను నిర్మించకుండా వదిలేశారు. దీంతో అక్కడి ప్రజల ప్రాణాలు గాలిలో దీపంగా మారాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో పలువురు వారి సొంత డబ్బులతో రెయిలింగ్, గోడలను ఏర్పాటు చేసుకున్నారు. క్రమేణ ప్రస్తుతం తుకారాంగేట్‌లోని మరాఠా బస్తీలోని భవనాలు సైతం శిథిలావస్థకు చేరువలో ఉన్నాయి. పైకప్పుల పెచ్చులూడుతున్నాయి. దీంతో ప్రమాదం ఎటువైపు నుంచి దూసుకొస్తోందో అని భయం భయంగా బతుకున్నారు.

పెచ్చులూడుతున్నాయి..

తమకు కేటాయించిన ఇళ్లకు రక్షణ గోడ, ఇంటిపై రేయిలింగ్ నిర్మించకపోవడంతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని జీవిస్తున్నామని అక్కడి బస్తీవాసులు వాపోతున్నారు. వీటికి తోడు కొన్ని ఇళ్లకు మరుగుదొడ్లను కూడా ఏర్పాటు చేయలేదని మరాఠాబస్తీ ప్రజలు చెప్పుకొస్తున్నారు.మెట్లకు రక్షణ గోడ లేకపోవడం, దానికి తోడు ఇంటిపైనా రెయిలింగ్ కూడా ఏర్పాటు చేయకపోవడంతో పైకి ఎక్కాలన్నా దిగాలన్నా భయం భయంతో వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. ముఖ్యంగా రెండో అంతస్తులో నివాసముంటున్న వారిలో వృద్ధులు, పిల్లలు కిందికి దిగాలంటేనే జంకుతున్నారు.మరాఠా బస్తీలోని భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరి పైకప్పు పెచ్చులూడుతున్నాయి. రెండేళ్ల క్రితం పెచ్చులూడి నిర్వాసితుడి కాలిపై పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఏడాది క్రితం కూడా ఇదే విధంగా పైకప్పు కూలిందని, ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిదంటున్నారు. ఇటీవల స్లాబ్ కూలి పడిందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న ఇళ్లకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు..

మరాఠా బస్తీలో గత కొన్నేళ్ల క్రితం ఎకనామికల్లీ వీకర్ సెక్షన్ (ఈడబ్ల్యూఎస్) స్కీమ్ కింద భవనాలు నిర్మించారు. నాటి నుంచి ఇప్పటి వరకూ ఇటు వైపు ఏ ఒక్క అధికారి, నాయకుడు తిరిగి చూడ లేదు. భవనాలు శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతోందోనని భయంగా ఉంది. ఇప్పటికే పలువురు నివాసితులు ప్రమాదాలకు గురయ్యారు. ఉన్నతాధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన ఇళ్లకు మరమ్మతులు చేయాలి.

–సనాధన్, మరాఠాబస్తీ నాయకుడు


బైక్ ర్యాలీలో మాట్లాడుతున్న మర్రి శశిధర్‌రెడ్డి

రాష్ట్ర ప్రజలు బీజేపీని కోరుకుంటున్నారు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి


రోడ్ షోలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి, పక్కనే మర్రి శశిధర్‌రెడ్డి

సనత్‌నగర్: రాష్ట్ర ప్రజలు బీజేపీని కోరుకుంటున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. సనత్‌నగర్ బీజేపీ అభ్యర్థి మర్రి శశిధర్‌రెడ్డికి మద్దతుగా సోమవారం నిర్వహించిన రోడ్‌షోలో ఆయన పాల్గొని మాట్లాడారు. బన్సీలాల్‌పేటలోని జబ్బార్ కాంప్లెక్స్ నుంచి రాణిగంజ్, మహంకాళి అమ్మవారి ఆలయం, సింధికాలనీ, పాటిగడ్డ, బేగంపేట అమీర్‌పేట, బల్కంపేట మీదుగా సనత్‌నగర్ జెక్‌కాలనీ మహాత్మాగాంధీ విగ్రహం వరకు రోడ్‌షో కొనసాగింది. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిస్తే అమ్ముడుపోతారని.. బీఆర్‌ఎస్ అభ్యర్థులు గెలిస్తే కేసీఆర్ కుటుంబానికి కొమ్ముకాస్తారని విమర్శించారు. కేసీఆర్ కుటుంబ, అవినీతి పాలనకు వ్యతిరేకంగా ప్రస్తుత ఎన్నికల్లో తీర్పును ఇవ్వబోతున్నారన్నారు. రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీ కనుచూపు మేరలో కూడా కనిపించడం లేదన్నారు. ఈ సారి ఎన్నికల్లో ఎంఐఎం సీట్లను కూడా తగ్గిస్తామన్నారు. రాష్ట్రంలో జరిగే బీజేపీ ప్రచార కార్యక్రమాలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీతో పాటు హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షురాలు నడ్డాలతో పాటు కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరుకానున్నారని అన్నారు. మర్రి శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో దేశం ప్రపంచంలోనే శక్తివంతంగా ఎదుగుతోందన్నారు. స్థానికంగా కూడా ప్రజలు మార్పు కోరుకుంటున్నారని చెప్పారు. సనత్‌నగర్ నియోజకవర్గంలో దౌర్జన్యం, గుండాయిజం రాజ్యమేలుతున్నాయన్నారు. తనపై నమ్మకంతో ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. రోడ్ షోలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్, కార్పొరేటర్లు సరళ కేతినేని, చీర సుచిత్ర, బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, అసెంబ్లీ ఇన్‌ఛార్జి సురేష్, కన్వీనర్ శ్రీశైలంగౌడ్‌లతో పాటు నాయకులు దయానంద్, క్రాంతికుమార్, ఆకూరి శ్రీనివాసరావు, చంద్రకుమార్, ఆకుల మహేష్, కేబుల్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

36 తుపాకుల స్వాధీనం

లాలాపేట: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో పలు చర్యలు తీసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు తెలిపారు.ఆయన మాట్లాడుతూ.. లైసెన్స్ తుపాకులు కలిగిన 36 మంది వచ్చి పోలీస్ స్టేషన్‌లో వాటిని డిపాజిట్ చేసినట్లు పేర్కొన్నారు. అంతేకాక పలువురిని బైండోవర్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.





వైభవంగా కోటి దీపోత్సవం

కవాడిగూడ: ఎన్‌టీఆర్ స్టేడియంలో కొనసాగుతున్న కోటిదీపోత్సవం ఏడో రోజు సోమవారం వైభవంగా జరిగింది. కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని పురుషోత్తమ భారతి మహాస్వామీజీ (శివగంగా మఠాధిపతి), అనుగ్రహం భాషణం వినిపించగా బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచనామృతం వినిపించారు. ప్రధాన వేదికపై నర్మదా బాన లింగానికి కోటి భస్మార్చన పూజ నిర్వహించారు. అనంతరం అరుణాచలేశ్వరస్వామి కల్యాణాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రి హరీష్‌రావు హాజరయ్యారు.

రాష్ట్ర బీజేపీ కార్యదర్శిగా ఆకుల విజయ

అమీర్‌పేట: తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యదర్శిగా ఆకుల విజయను నియమించారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి నియామక పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టపడ్డ వారికి బీజేపీలో గుర్తింపు లభిస్తోందన్నారు.

హాస్టల్ భవనంపై సెల్ టవర్‌ను తొలగించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని సెంటినరీ మహిళ హాస్టల్ భవనంపై ఏర్పాటు చేసిన సెల్ టవర్‌ను వెంటనే తొలగించాలని పీడీఎస్‌యూ గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు డిమాండ్ చేశారు. హాస్టల్ భవనంపై ఏర్పాటు చేసిన సెల్ టవర్‌తో విద్యార్థినులు వివిధ రకాల అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని చీఫ్ వార్డెన్ డా.శ్రీనివాస్‌రావుకు వినతి పత్రం అందజేశారు. హాస్టల్ భవనంపై కాకుండా మరో ప్రాంతంలో ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రావణ్, సుమన్, శ్రావణి, మనీషా, అనూష, నిహారిక, కాసింబి, సంపత్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.19, నల్లవంకాయ 15, పొడుగు వంకాయ 15, బెండకాయ 40, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 40, పచ్చకాకర 23, పందిరి బీర 35, క్యాబేజీ 11, క్యారెట్ 35, దొండ 23, గుండుబీన్స్ 60, గింజ చిక్కుడు 45, గోకరకాయ 35, కీర 25, దోసకాయ 13, బీట్‌రూట్ 27, ఉల్లిగడ్డ 35, ఆలుగడ్డ 21, చామగడ్డ 37, మొరంగడ్డ 25, కందగడ్డ 53, సొరకాయ 9, పొట్లకాయ 13, అరటికాయ 10, మునగకాయ 4–6, ముల్లంగి 4–6. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

సన్మానం



మాజీ ఎమ్మెల్సీ, ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య 99వ జన్మదినం సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఈఓ శ్రీనివాసరాజు సమక్షంలో అర్చకులు ఆయనను ఆశీర్వదించి శాలువాతో సత్కరించారు.

–సనత్‌నగర్

అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యం

బీఆర్‌ఎస్ అభ్యర్థి తలసాని శ్రీనివాస్‌యాదవ్


తనకు ఓటేయాలని అభ్యర్థిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

అమీర్‌పేట: తెలంగాణ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని సనత్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు.అమీర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో ఉత్తర్ భారతీయ ప్రవాసీ సేవా సంఘ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దీపావళి స్నేహ సమ్మేళన్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. మినీ ఇండియాగా పిలువబడే హైదరాబాద్‌లో వివిధ భాషలు, ప్రాంతాలకు చెందిన వారు నివసిస్తున్నారని ఇక్కడ ఉంటున్న వారంతా తెలంగాణ బిడ్డలేనని, ప్రభుత్వం అందరిని కడుపులో పెట్టుకుని చూసుకుంటుందన్నారు. రాష్ట్రం ఏర్పడ్డాక ఎంతో అభివృద్ధి సాధించి దేశంలోని ప్రధాన నగరాల్లో హైదరాబాద్ ఒకటిగా నిలిచిందని గుర్తు చేశారు. శాంతి భద్రతల పర్యవేక్షణలో దేశంలోనే ప్రథమస్థానంలో ఉన్నట్లు పేర్కొన్నారు. సనత్‌నగర్‌లో జరిగిన అభివృద్ధి ప్రజల ముందు ఉందని, 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో తలసాని సాయికిరణ్‌యాదవ్, నామన శేషకుమారి, అగర్వాల్ సమాజ్ అధ్యక్షులు మనీష్ అగర్వాల్, జైన్ సమాజ్ అధ్యక్షులు హన్స్‌రాజ్ కొఠారి, గులాబ్‌సింగ్, బాస్నా, ఉత్తమ్, చైన్‌సింగ్, పీయూష్ గుప్తా పాల్గొన్నారు.


తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను ఆశీర్వదిస్తున్న సంఘ్ ప్రతినిధులు

సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో..

సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు.ఎస్ఆర్‌నగర్ సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి మంత్రి హాజరై మాట్లాడారు. ఉద్యోగ విరమణ తర్వాత కూడా విశ్రాంతి తీసుకోకుండా సమాజానికి సేవ చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతుండటం స్ఫూర్తిదాయకమన్నారు. కౌన్సిల్‌కు తన సహాయ సహకారాలు ఎప్పుడు ఉంటాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎస్. శేషుకుమారి, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు కొలను బాల్‌రెడ్డి,కౌన్సిల్ అధ్యక్షులు మానిక్‌రావు, సహదేవ్‌గౌడ్, లింగమయ్య, యాదగిరి పాల్గొన్నారు.

దాసారం గుడిసెవాసులకు పక్కా ఇళ్లు నిర్మిస్తాం

సనత్‌నగర్: దాసారం గుడిసెవాసులకు పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తామని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ హామీ ఇచ్చారు. సనత్‌నగర్‌లోని సాయిబాబానగర్, దాసారం బస్తీ, ఎల్ఐజీ, సీటైప్ క్వార్టర్స్ ప్రాంతాల్లో సోమవారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అత్యంత నిరుపేదలు నివసించే ఈ ప్రాంత ప్రజలకు ఏ సమస్య ఉన్నా పరిష్కరిస్తూ వచ్చామని, స్థలం విషయం కోర్టులో కేసు నడుస్తోందని, తప్పకుండా కేసును మనమే గెలుస్తామని ధైర్యం చెప్పారు. కేసు పరిష్కారమైన తర్వాత ఉచితంగా పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తామని ప్రకటించారు. ఏ అవసరమొచ్చినా తానున్ననే విషయాన్ని మరవొద్దన్నారు. ఓట్ల కోసం ఎవరెవరో వచ్చి కల్లబొల్లి మాటలు చెబుతారని, వారి మాటలను నమ్మి మోసపోవద్దన్నారు. ప్రచారంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, నాయకులు కొలను బాల్‌రెడ్డి, సురేష్‌గౌడ్ ఖలీల్‌బేగ్, కరుణాకర్‌రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, రమేష్‌గౌడ్ ప్రవీణ్, రాజేష్, భద్రయ్య, పుష్పలత, ఝాన్సీ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక..

ప్రచారంలో భాగంగా దాసారం బస్తీ ప్రాంతంలోని యువకులు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి ఆయన కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో అభిమన్యు, నవీన్, అంజన్, సత్యనారాయణ, గణేష్, వంశీ, బాలు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'ఆరు గ్యారంటీ'లు అమలుచేస్తాం


ప్రచారం చేస్తున్న వెన్నెల

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ వెన్నెల సోమవారం మూడవ వార్డు బేరర్స్‌లైన్, గాంధీనగర్, శ్రీరాంనగర్, చర్చ్‌గల్లీ మహంకాళి టెంపుల్ లైన్, మడ్‌ఫోర్ట్ బస్తీ, కంటోన్మెంట్ క్వార్టర్స్, వాహబ్‌నగర్, కట్టకింది బస్తీతో పాటు 150 డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని వెన్నెల హామీ ఇచ్చారు. ప్రచారంలో జమీల్, ఉత్తరయ్య, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.


క్రిస్టియన్ మైనార్టీలంతా బీఆర్‌ఎస్ వైపు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ స్టీఫెన్‌సన్

రసూల్‌పురా: క్రిస్టియన్లకు కాంగ్రెస్ పార్టీ చేసిందేమీ లేదని ఆ పార్టీ నాయకులు కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకున్నారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ స్టీఫెన్‌సన్ విమర్శించారు. కంటోన్మెంట్ కేజేఆర్ గార్డెన్‌లో నిర్వహించిన క్రిస్టియన్ల ఆత్మీయ సమావేశంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి లాస్యనందిత, ఎమ్మెల్సీ ప్రభాకర్‌రావు, నియోజకవర్గ ఇన్‌చార్జులు బెవరేజేస్ కార్పొరేషన్ ఛైర్మన్ గజ్జెల నాగేష్, ఎంఎన్. శ్రీనివాస్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్టీఫెన్ మాట్లాడుతూ.. క్రిస్టియన్ మైనార్టీలంతా సెక్యులర్ పార్టీ బీఆర్‌ఎస్ వైపే ఉన్నారని, తమ సంక్షేమం కోసం పథకాలను అమలు చేస్తున్న సీఎం కేసీఆర్‌కు పూర్తి మద్దతు ఇస్తూ ఇతర పార్టీలు తమకు అవసరం లేదని తేల్చి చెప్పారన్నారు. ఎమ్మెల్సీ ప్రభాకర్ రావు మాట్లాడుతూ.. క్రిస్టియన్లు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరిస్తామని లాస్యనందితను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, మాజీ సభ్యులు పాండు యాదవ్, పార్టీ నాయకులు డిబి. దేవేందర్ టిఎన్. శ్రీనివాస్, ఖదీరవన్ బిషప్ నెహమ్యా శ్రీనివాస్ రావు, పాస్టర్లు జూలియన్, మనోహర్, అరుణ్ విక్టర్ మేరి సతీష్ పాల్గొన్నారు.

నలుగురు కాదు..
నలభై మంది ఏకమైనా గెలిచేది బీఆర్‌ఎస్సే


మాట్లాడుతున్న ఎంఎన్. శ్రీనివాస్

రసూల్‌పురా: జెండా, ఎజెండా ఏంటో తెలియని నాయకులు, బీఆర్‌ఎస్ అభ్యర్థిపై చేస్తున్న విమర్శలను మానుకుని, పూటకో పార్టీ రోజుకో జెండా మార్చే నాయకులు ప్రజలకు ఏం చేస్తారో చెప్పాలని బీఆర్‌ఎస్ కంటోన్మెంట్ ఇన్‌చార్జి ఎంఎన్. శ్రీనివాస్ సవాల్ చేశారు. కేజేఆర్ గార్డెన్‌లో సోమవారం ఆయన లాస్యనందితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇప్పటికే మూడు జెండాలు మార్చి నాలుగో జెండాకు చేరిన వారు ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. ఫేక్ వీడియోలపై విచారణ జరిపించి చర్యలు చేపడుతామన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా అభివృద్ధి, సంక్షేమమే తమ ఎజెండా అన్నారు. బోర్డు మాజీ సభ్యులు జక్కుల మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాక్షేత్రంలో తేల్చుకోలేక కొందరు నేతలు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని బీఆర్‌ఎస్ గెలుపు ఖాయమైపోవడంతో కొందరు నాయకులు ఓటమి భయంతో ఆరోపణలు చేస్తున్నారని నలుగురు బోర్డు మాజీ ఉపాధ్యక్షులు కాదు నలభై మంది ఏకమైనా కంటోన్మెంట్‌లో గెలిచేది బీఆర్‌ఎస్ అని స్పష్టం చేశారు. టీఎన్. శ్రీనివాస్.డిబి. దేవేందర్, ముప్పిడి గోపాల్, ఖదీరవన్, బోర్డు మాజీ సభ్యులు పాండుయాదవ్ పాల్గొన్నారు.